క్లుప్తంగా...

11 మంది విద్యార్థులకు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్

రాజేంద్రనగర్: కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి శాఖ (విద్యాశాఖ) ప్రతి సంవత్సరం జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇచ్చే నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అంజయ్య తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఇందుకు సంబంధించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. కళాశాలకు చెందిన 11 మంది విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని వెల్లడించారు. జిల్లాలోని ఏ ఇతర కళాశాల నుంచి 11 మంది విద్యార్థులు ఎంపిక కాలేదన్నారు. ఎంపికైన వారిలో సిహెచ్.గణేష్, నాజియ, మంజుల చవాన్, జూనైద్, సునీత, సమ్రీన్, ఆమర్ ఖాన్, రేవంత్ కుమార్, గౌసియా బేగం, అర్చన, నిఖత్ తదితర విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఈ స్కాలర్‌షిప్స్‌కు ఎంపికైన డిగ్రీ చదివే విద్యార్థులకు ప్రతి సంవత్సరం 10 వేల రూపాయల చొప్పున 30 వేల రూపాయలు, పీజీ చదివే విద్యార్థులకు ప్రతి సంవత్సరం 20 వేల రూపాయల చొప్పున 40 వేల రూపాయలు మొత్తం 70 వేల రూపాయలు స్కాలర్‌షిప్ అందుతుందన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదాధామంలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్య శాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉచిత కంటి శిబిరానికి ముఖ్య అతిథిగా విద్యాభారతీ దక్షిణ మధ్యక్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో గోకరి అర్జున్‌గౌడ్, ఆవాస విద్యాలయం కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్, ప్రధానాచార్యులు బిక్షపతి, అకడమిక్ ఇన్‌చార్జి మాతృమూర్తి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం



అబిడ్స్: రహింపురాలో జరిగే బతుకమ్మ, దాండియా వేడుకలకు రావాలని ఎమ్మెల్సీ కవితకు మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 18న రహింపురా ప్లే గ్రౌండ్‌లో దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దాండియా, బతుకమ్మ వేడుకలు పెద్ద ఎత్తున చేపడుతామన్నారు.

జీఎన్ఐటీఎస్‌లో వరల్డ్ మెంటల్ హెల్త్ డే

గోల్కొండ: ఫిక్స్‌డ్ మైండ్ సెట్ నుంచి గోల్ మైండ్ సెట్ కోసం ప్రయత్నించే వ్యక్తులు తమ శక్తియుక్తులను సంపూర్ణంగా వినియోగించుకుంటారని ప్రముఖ సైకాలజిస్టు విశేష్ అన్నారు. గురువారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మైండ్ సెట్ మ్యాటర్స్-అన్‌లాకింగ్ యువర్ పోటెన్షియల్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరల్డ్ మెంటల్ హెల్త్ డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల కౌన్సెలింగ్ కమిటీ కన్వీనర్ వి.జాహ్నవి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వి.ఎస్.ఎల్.నర్సింహ, మెడికల్ కమిటీ కన్వీనర్ పి.వి.రామ్మోహన్‌రెడ్డి, సూర్యకుమారి, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంపుపై దృష్టి



రాజేంద్రనగర్: గత ఎన్నికల కంటే ప్రస్తుతం రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో 1,05,459 కొత్త ఓటర్లు పెరిగారు. గత ఎన్నికల్లో 4,46,903 మంది నియోజకవర్గంలో ఓటర్లుగా నమోదై ఉన్నారు. వీరిలో కేవలం 56 శాతం మాత్రమే గత ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రస్తుతం ఓటర్ల తుది ఓటర్ల జాబితాను అధికారులు ప్రకటించారు. నియోజకవర్గంలో 5,52,362 మంది ఓటర్లుగా నమోదయ్యారు. వీరిలో 2,88,270 మంది పురుషులు, 2,64,053 మంది మహిళలు, 39 మంది ఇతరులు ఓటర్లుగా ఉన్నారు. గత ఎన్నికల కంటే ప్రస్తుతం 1,05,459 కొత్తగా ఓటర్లుగా నమోదయ్యారు. వీరిలో 10 వేల మంది ప్రస్తుతం మొదటిసారి ఓటు హక్కును వినియోగించనున్నారు.

పెరిగిన పోలింగ్ బూత్‌లు...

నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌లు భారీ సంఖ్యలో పెరిగాయి. గత ఎన్నికల్లో 441 పోలింగ్ బూత్‌లుండగా... ప్రస్తుతం ఓటర్లు పెరగడంతో కొత్తగా 94 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. దీంతో నియోజకవర్గంలో 535 పోలింగ్ బూత్‌లు కొనసాగనున్నాయి. గత ఎన్నికల్లో గండిపేట్ మండలంలో 106, రాజేంద్రనగర్ సర్కిల్‌లో 249, శంషాబాద్ మండలంలో 86 పోలింగ్ బూత్‌లు కొనసాగాయి. ప్రస్తుతం గండిపేట్ మండలంలో 157, రాజేంద్రనగర్ సర్కిల్‌లో 284, శంషాబాద్ మండలంలో 94 ఏర్పాటు చేశారు.

రాజేంద్రగనర్ నియోజకవర్గంలో పెరిగిన ఓటర్లు

- కొత్త ఓటర్లు లక్ష మంది
- మొదటి సారి ఓటు వేయనున్న 10వేల మంది

జంగ్ 2023 తెలంగాణ

ఓటింగ్ శాతం పెరిగేందుకు...

గత ఎన్నికల్లో నియోజకవర్గంలో కేవలం 56 శాతం ఓటర్లు మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రస్తుతం ఓటర్లలో చైతన్యం నింపేందుకు అధికారులు ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఓటు హక్కును వినియోగించుకునేలా సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు ప్రారంభించారు.

పక్కాగా తనిఖీలు నిర్వహించాలి



రిటర్నింగ్ అధికారి మల్లయ్య ఆధ్వర్యంలో అధికారులతో సమావేశమైన రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి

అత్తాపూర్: వాహనాల తనిఖీలు పక్కాగా నిర్వహించాలని రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి పోలీసు సిబ్బందిని ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం ఆయన ఆర్డీఓ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి మల్లయ్య ఆధ్వర్యంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని... పోలీసులు రాజకీయ నాయకులకు దూరంగా ఉండాలని సూచించారు. వాహనాల తనిఖీల సమయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ గంగాధర్, రాజేంద్రనగర్ తహసీల్దార్ వేణుగోపాల్, గండిపేట్ మండలం సూపరింటెండెంట్ జంగయ్య, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ టికెట్ కేటాయించండి

అత్తాపూర్: రాజేంద్రనగర్ అసెంబ్లీ నుంచి బీజేపీ అభ్యర్థిగా టికెట్టు కేటాయించాలని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిటీ ఇన్‌చార్జి జవదేవకర్‌ను కోరుతూ చేవేళ్ల పార్లమెంటు కన్వీనర్ నారగూడెం మల్లా రెడ్డి వినతిపత్రం అందజేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో రాజేంద్రనగర్ అసెంబ్లీలోని ఐదు డివిజన్లలోని మూడు డివిజన్లు బీజేపీ గెలవడానికి ప్రత్యక్ష కారణమైన తనకు పార్టీ గుర్తించి టికెట్టు కేటాయించాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీ ఖాయం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని అత్తాపూర్ డివిజన్ పార్టీ అధ్యక్షులు ముద్దగౌని భాస్కర్ గౌడ్ వెల్లడించారు. గురువారం రాత్రి అత్తాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోను ఇంటింటికి వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అందించిన సోనియాగాంధీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణకు ప్రత్యేక మెనిఫెస్టోను అందించారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థుల నిరసన



తమ సమస్యలు పరిష్కరించాలని హెచ్ఓ, హెచ్ఈఓ పోస్టులు భర్తీ చేయాలని కొరుతూ శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విద్యార్థులు చేస్తున్న నిరసన 9వ రోజుకు చేరుకుంది. గురువారం ఉద్యాన విశ్వవిద్యాలయంలో శ్రీకొండా లక్ష్మణ్ విగ్రహం కళ్లకు కండ్లకు నల్లగుడ్డకట్టి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. విద్యార్థి నాయకులు సంగారెడ్డి ,ప్రశాంత్, సాయికిరణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

– ఏజీవర్సిటీ

రాజేంద్రనగర్‌లో కాంగ్రెస్ విజయం ఖాయం



కాంగ్రెస్ పార్టీలో పెద్ద ఎత్తున చేరిన ఇతర పార్టీల కార్యకర్తలు, నేతలు

శంషాబాద్: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని శంషాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని మైనార్టీలు, ఆయా పార్టీలకు చెందిన నేతలు గురువారం పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. పదిహేనేళ్లుగా పనిచేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేతో నియోజకరవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోయిందన్నారు.

గొలుసు దొంగల రిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న నార్సింగి ఏసీపీ లక్ష్మీనారాయణ

మణికొండ: తాగేందుకు మంచినీటిని ఇవ్వాలని ఇంటి ముందుకు వచ్చి అడిగి తీసుకుని ఓ వ్యక్తి మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును తస్కరించిన దొంగలను నార్సింగి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను గురువారం నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఏసీపీ లక్ష్మీనారాయణ వివరించారు. సెప్టెంబర్ 25వ తేదీన నార్సింగి సాయిబాబ దేవాలయం సమీపంలో నివసిస్తున్న అంజయ్య ఇంటి వద్ద ఉండగా ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి తాగేందుకు మంచినీరు ఇవ్వాలని అడిగారు. అదే సమయంలో ఓ వ్యక్తి బైక్‌పై నుంచి కిందకు దిగి అతని మెడలోని రెండు తులాల గొలుసుకుని లాక్కుని పరారయ్యారు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు బుధవారం ఎంఎం పహాడికి చెందిన కార్పెంటర్ పాలిష్ పనిచేసే సయ్యద్ అబ్బాస్, హఫీజ్‌పేట్‌కు చెందిన ఆటో డ్రైవర్ వినాయక్‌రెడ్డిలు అనుమానాస్పదంగా హైదర్‌షాకోట్‌లో తిరుగుతుండగా క్రైం టీం అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించారు. గత నెల నార్సింగిలో చేసిన గొలుసు దొంగతనం కేసును అంగీకరించారు. వీరి నుంచి బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

విద్యార్థులకు మంచినీటిని అందించాలి



ఫౌండేషన్ ప్రతినిధులకు చెక్కును అందజేస్తున్న కౌన్సిలర్ శివారెడ్డి

మణికొండ: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ప్యూరిఫైడ్ తాగునీటిని అందించాల్సిన అవసరం ఉందని, అందుకు అవసరమైన నిధులను తాను అందిస్తానని నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట కౌన్సిలర్ జి.శివారెడ్డి అన్నారు. కోకాపేట ప్రభుత్వ పాఠశాలలో ఆర్ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన రూ.20వేల చెక్కును ఆయన గురువారం కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ వారికి అందించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.మాధవరెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రం తెలంగాణ

గోల్కొండ: సీఎం కేసీఆర్ హయాంలో దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గం అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. గురువారం గుడిమల్కాపూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో కార్వాన్ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మిత్ర కృష్ణ మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్కసారి కూడా ఖర్ఫ్యూ విధించలేదని, అదే విధంగా కరెంటు కటింగ్‌లు, తాగునీటి కటకటలు లేవన్నారు. కేసీఆర్ సమయోచిత నిర్ణయాలు, పాలన సమర్థతతోనే ఇది సాధ్యమైందని ఆయన అన్నారు. కార్వాన్‌లో ఈ సారి తాను కచ్చితంగా గెలుస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్, తూమ్‌కుంట అరుణ్‌కుమార్, శివరాత్రి రాములు, పద్మ తదితరులున్నారు.

ప్రధానోపాధ్యాయుడికి ఘనంగా వీడ్కోలు



శంషాబాద్: పట్టణంలోని తొండుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఇటీవల బదిలీఅయిన యాదయ్యను సన్మానించారు. సుదీర్ఘ కాలంగా తొండుపల్లి పాఠశాలలో ఆయన అందించిన సేవలను కొనియాడారు. కౌన్సిలర్లు లావణ్య శ్రీనివాస్‌గౌడ్, రాణి పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత లోపించింది

శంషాబాద్ రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపికలో పారదర్శకత లేకుండా పోతోందని సభ్యులు మండిపడ్డారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. బీసీ బంధు, దళితబంధు, గృహలక్ష్మీ వంటి పథకాల లబ్ధిదారులను ఇష్టానుసారంగా ఎంపిక చేయడం తగదని ఎంపీటీసీ సభ్యుడు ఎల్లయ్య ఆరోపించారు. పంచాయతీలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను ఇవ్వడంలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వీరాజు, వైఎస్ ఎంపీపీ నీలం, ఎంపీడీఓ వసంతలక్ష్మీ, ఎంపీఓ ఉషాకిరణ్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో ఫిజిటెల్ ల్యాబ్ ప్రారంభం

శంషాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని ఏవియేషన్ అకాడమి ప్రాంగణంలో ఫిజిటెల్ ల్యాబ్‌ను ప్రారంభించింది. 10 వేల చదరపు అడుగుల స్థలంలో దీనిని ఏర్పాటు చేశారు. సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలను పెంపొందించేందుకు ఇందులో శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించారు. సైబర్ సెక్యూరిటీ బృందాలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడానికి అందుబాటులో ఉంటుందన్నారు. టీఎస్ టీఎస్ చైర్మన్ పి. జగన్ మోహన్‌రావు పాల్గొన్నారు.



మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



నారాయణ ఒలంపియాడ్ స్కూల్‌లో..



శంషాబాద్ రవీంద్రభారతి పాఠశాలలో



మణికొండ ప్రభుత్వ పాఠశాలలో..

ఘనంగా బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు గురువారం పలు పాఠశాలల్లో సందడిగా జరిగాయి. విద్యార్థులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మలను పేర్చి వాటిపై గౌరమ్మలను ఉంచి పూజలు నిర్వహించి ఆట, పాటలతో సందడి చేశారు.

– మణికొండ



త్రివేణి స్కూల్‌లో ..



మైలార్‌దేవ్‌పల్లి గాయత్రి పాఠశాలలో..



రవీంద్ర భారతి పాఠశాలలో..

